# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-05-2024    సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విద్యార్థులకు ఉజ్వల్ భవిష్యత్ అందించడమే లక్ష్యంగా డాక్టర్ బి ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కృషి చేస్తోందని ఉపకులపతి ఆచార్య కె. ఆర్. రజనీ పేర్కొన్నారు.
- ❖ రెమాల్ తుఫాన్ ఈరోజు అర్థరాత్రి పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటనుంది.
- ❖ పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది.
- ❖ ప్రజలంతా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉండాలని అనకాపల్లి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ కోరారు.
- ❖ ఐపీయల్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ కోల్‌కతా నైట్ రైడర్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మరికాసేపట్లో ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థులకు ఉజ్వల్ భవిష్యత్ అందించడమే లక్ష్యంగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కృషి చేస్తోందని ఉపకులపతి ఆచార్య కె.ఆర్. రజనీ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో ఉన్న విశ్వవిద్యాలయంలో పాత్రికేయులతో ఈరోజు ఆమె మాట్లాడుతూ... పరిశోధనా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, పి.జి. స్థాయిలో బోధించే సబ్జెక్టులన్నింటికీ తాజాగా మార్పులు చేయాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించి పట్టా తీసుకున్న విద్యార్థులకు బయటకు వెళ్లిన వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రథమ కర్తవ్యమని ఆమె తెలియజేశారు. జాతీయ స్థాయిలో శ్రీకాకుళం అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దటమే తమ ప్రధాన లక్ష్యమని ఉపకులపతి రజనీ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుంటూరు - సికింద్రాబాద్ రైల్వేమార్గంలో ఈరోజు మధ్యాహ్నం గూడ్స్ రైల్ పట్టాలు తప్పింది. నల్గొండ జిల్లా దామచర్ల మండలం విష్ణుపురం రైల్వేస్టేషన్ వద్ద గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపుగా వెళ్తున్న గూడ్స్ రైలు పక్కకు ఒరిగిపోవడంతో రెండు బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో గుంటూరు - సికింద్రాబాద్ మార్గంలో ఈరోజు ప్రయాణిస్తున్న రైళ్లు ఆలస్యం కానున్నాయి. శబరి ఎక్స్‌ప్రెస్‌ను మిర్యాలగూడలోనే నిలిపివేశారు. కాగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను పిడుగురాళ్లలో నిలిపివేసినట్టు రైల్వే అధికారులు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పోస్టల్ బ్యాలట్లకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. పోస్టల్ బ్యాలెట్ పై రిటర్నింగ్ అధికారి (ఆర్వో) ఆమోద ముద్ర లేని కారణంగా పోస్టల్ బ్యాలెట్లను తిరస్కరించవద్దని పేర్కొంది. ఆర్వో సంతకం ఉన్న పోస్టల్ బ్యాలెట్లు చెల్లుబాటు అవుతాయని తెలిపింది. అదేవిధంగా ఫామ్ - 13ఏ పై ఆర్వో సంతకంతో పాటు అన్ని వివరాలు ఉండాలని, ఆర్వో సంతకం సహా బ్యాలెట్ ను ధ్రువీకరించే రిజిస్టర్‌తో సరిపోల్చుకోవాలని సూచించింది. ఫామ్- 13ఏలో ఓటరు సంతకం, ఆర్వో సంతకం, బ్యాలెట్ సీరియల్ నంబర్ లేకుంటే వాటిని తిరస్కరించవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం ఈ మార్గదర్శకాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు పంపించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి ఒక్కరూ దైనందిక జీవితంలో కొంత సమయం యోగా కు కేటాయిస్తే ఆరోగ్య వంతంగా జీవిస్తారని ఎన్టీర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి .సంపత్ కుమార్ అన్నారు. అమరావతి యోగా ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన వేసవి ఉచిత యోగా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ఈరోజు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పురాతన కాలం నుండే యోగా ఆసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం భారిన పడుతున్నారని, మానవ శరీరంలో సర్వ శక్తులను ఏకం చేసి ఏకాగ్రత సాధించడానికి యోగా సర్వ రోగాలకు దివ్యౌషధంలా పనిచేస్తుందన్నారు. తల్లి దండ్రులు పిల్లల్ని యోగా వైపు మక్కువ చూపేలా ప్రోత్సహించాలని పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజలంతా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉండాలని అనకాపల్లి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ కోరారు. ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అచ్యుతాపురంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, దీని కోసం అన్నదమ్ముల్లా ఉండాల్సిన ప్రజలు ఘర్షణలు, కొట్లాటలకు దిగడం మంచిది కాదన్నారు. జిల్లాలో పోలీస్ చట్టంతో పాటు 144 సెక్షన్ అమలులో ఉందని... ఊరేగింపులు, ర్యాలీలు, బాణసంచా పేలుళ్లు నిషేధమని పేర్కొన్నారు. అలాగే ఎవరైనా వీటిని అతిక్రమిస్తే అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రెమాల్ తుఫాను నేపథ్యంలో తక్షణ సహాయాన్ని అందించేందుకు భారత నౌకాదళం (ఇండియన్ నేవీ) సన్నాహక చర్యలను ప్రారంభించింది. తుఫాను ఈ రోజు అర్ధరాత్రి పశ్చిమ బెంగాల్‌లోని సాగర్ ద్వీపం బంగ్లాదేశ్‌లోని ఖేపుపరా మధ్య తీరం దాటి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉండటంతో... ముందస్తు చర్యల్లో భాగంగా ఇండియన్ నేవీ సత్వర సహాయాన్ని అందించేందుకు పరికరాలతో కూడిన ప్రత్యేక డైవింగ్ బృందాలను కోల్‌కతాలో సిద్ధం చేసింది. అవసరమైన

వైద్య పరికరాలతో మరిన్ని డైవింగ్ బృందాలు, వరద సహాయక బృందాలను విశాఖపట్నంలో సిద్ధంగా ఉంచింది. ఇదిలా ఉండగా ఈ తుఫాన్ ప్రభావం ఆంధ్రప్రదేశ్ పై అంతగా ఉండదని ఒకటి రెండు చోట్ల వర్షాలు కురుస్తాయని, పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని విశాఖ వాతావరణ శాఖ అధికారిణి సునంద పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీయల్) 17వ సీజన్ ఫైనల్ మ్యాచ్ మరికాసేపట్లో ప్రారంభం కానుంది. కోల్‌కతా నైట్ రైడర్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఈ క్రికెట్ మ్యాచ్ చెన్నై లోని చెపాక్ స్టేడియం వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఐపీఎల్- 2024 విజేతగా నిలుస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నిషేధిత సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ పెదబయలు దళానికి చెందిన 13 మంది మిలీషియా సభ్యులు అల్లూరి సీతారామరాజు జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఈరోజు స్వచ్ఛందంగా లొంగిపోయారు. జిల్లాలోని పెదబయలు గిన్నెలకోట ప్రాంతానికి చెందిన 13 మంది గిరిజనులు సమాజంలో మంచి జీవితం జీవించాలని ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏఎస్పి ప్రతాప్ శివ కిషోర్, పాడేరు, రంపచోడవరం ఏ ఎస్పీ దీరాజ్, జి.మాడుగుల సి ఐ రమేష్, పెదబయలు ఎస్ ఐ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్లను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఈరోజు ఉదయం పరిశీలించారు. పోలీసు జాయింట్ కమిషనర్ ఫక్కీరప్పతో కలిసి పార్లమెంటు, అంసెబ్లీ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆధార్ కార్డు వివరాలను జూన్ 14వ తేదీ లోగా అప్‌డేట్ చేసుకోకపోతే కార్డు పని చేయదంటూ వస్తున్న వదంతులను నమ్మొద్దని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికారిక సంస్థ (UIDAI) కోరింది. ఆధార్‌లో కేవలం ఉచితంగా వివరాలు సవరించుకోవడానికి మాత్రమే జూన్ 14 గడువని తెలిపింది. మార్చుకోకపోయినా ఆధార్ పని చేస్తుందని స్పష్టం చేసింది. తర్వాత కూడా వివరాలు మార్చుకునేందుకు అవకాశం ఉంటుందని, ఆధార్ కేంద్రాలకు వెళ్లి నిర్దేశిత రుసుము చెల్లిస్తే సరిపోతుందని తెలియజేసింది. కనీసం పదేళ్లకోసారి గుర్తింపుకార్డు, చిరునామా ధ్రువీకరణ పత్రాలు సమర్పించి కేంద్ర గుర్తింపు సమాచార నిధి (CIDR)లోని వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ (UIDAI) పేర్కొంది. ఈ ప్రక్రియ వల్ల పౌరుల సమాచారం సీఐడీఆర్ వద్ద ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఉంటుందని వివరించింది. వివరాలు అప్‌డేట్ చేసుకోవడానికి ఉడాయ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యి తాజా గుర్తింపు కార్డు, అడ్రస్ వివరాలను సబ్మిట్ చేయాలని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =